సాక్షి వికారాబాద్

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



ధాన్యం పైసలు మహాప్రభో!

రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లో వడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. 8లో▸



పేదల బియ్యం పక్క దారి!

పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొన్నేళ్లుగా రేషన్ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. 8లో▸



గొర్రెల పంపిణీ ఏదీ?

గొర్రెల యూనిట్ల కోసం డబ్బులు చెల్లించినా పథకం అమలు కావడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

పీఎంను కలిసిన పారిశుద్ధ్య కార్మికురాలు



ప్రధాని మోదీతో పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మి

కొడంగల్ రూరల్: మండలంలోని హస్నాబాద్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మి కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం ఆమె ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం లక్ష్మి తోపాటు నలుగురిని ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసింది. స్వచ్ఛత, తడి పొడి చెత్త వేరు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చడం, చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయడం తదితర వాటిపై లక్ష్మి సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. లక్ష్మి కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తోటి సిబ్బంది అన్నారు. త్వరలో అధికారులు అవార్డును అందజేస్తారని లక్ష్మి తెలిపారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దౌల్తాబాద్: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వంట చేసే మహిళల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి చదివి, స్థానికురాలై ఉండాలని, అసిస్టెంట్ కుక్ 7వ తరగతి చదివి స్థానికులై ఉండాలని తెలిపారు. ఈ నెల10వ తేదీ లోపు ఎంఆర్‌సీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందాం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



ఆనంద్‌ను సన్మానిస్తున్న తండా వాసులు

మర్పల్లి: రానున్న ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండలంలోని నర్సాపూర్ చిన్న, పెద్ద తండాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. అనంతరం ఆయా తండాల్లో జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ కొంషెట్‌పల్లి గ్రామ అధ్యక్షుడు వీరేశంగౌడ్ తల్లి మాణెమ్మ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్

తాండూరు టౌన్: పట్టణ శివారులోని పాత శాలివాహన కళాశాల మైదానంలో ఈ నెల 4న సబ్ జూనియర్ జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్ నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ మధు, సెక్రటరీ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ – 8, 10, 12, 14 బాలబాలికల విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ తదితర పోటీలు ఉంటుందని తెలిపారు. 4వ తేదీ ఉదయం 9 గంటలకు క్రీడాకారులు పాత శాలివాహన కళాశాల మైదానంలో ఉండాలని సూచించారు. పోటీలకు వచ్చేవారు తహసీల్దార్ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 9న జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంఈఓ హరిశ్చందర్‌నాయక్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు దశరథ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ స్థానంలో డబ్బు కట్టాల్సిందే..!

గడువులోగా బియ్యం ఇవ్వని మిల్లర్లు

- 20వేల మెట్రిక్ టన్నులు వారి వద్దే
- ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తం రూ.70 కోట్లు
- 25శాతం ఫైన్ అదనం
- గత ఖరీఫ్‌కు సంబంధించి 35శాతం..
- ప్రస్తుత రబీకి సంబంధించి 90శాతం బియ్యం మిల్లుల్లోనే..



మిల్లర్ల నుంచి సేకరించిన బియ్యం

వికారాబాద్: మిల్లర్లు చేసిన తప్పులు వారి మెడకే చుట్టుకుంటున్నాయి. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇచ్చేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు జనవరి 31తో ముగియడంతో బియ్యం స్థానంలో డబ్బు, 25శాతం ఫెనాల్టీ చెల్లించాల్సి వస్తోంది. ఇది వారి స్వయంకృతాపరాధమేనని అధికారులు అంటున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించింది. 15 రోజుల్లో వడ్లను ఆడించి సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇవ్వాలి. అయితే మిల్లర్లకు ధాన్యం పంపి ఏడాది దాటినా ఇంకా ప్రభుత్వానికి బియ్యం ఇవ్వలేదు. దీంతో అనేక సార్లు ప్రభుత్వం లేవీ ఇచ్చేందుకు గడువు పొడిగిస్తూ వచ్చింది. చివరి సారిగా ఇచ్చిన గడువు జనవరి 31తో ముగిసింది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లర్లు సీఎంఆర్‌కు బదులుగా డబ్బు చెల్లించాలి. అంతేకాకుండా 25 శాతం ఫైన్ కట్టాలని షరతు విధించింది.

మిల్లర్లు చెల్లించాల్సిన మొత్తం రూ.87.5 కోట్లు

సీఎంఆర్ ఇవ్వడంలో రైసు మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించిన వడ్లను 15 రోజుల్లోగా బియ్యంగా మార్చి ప్రభుత్వానికి ఇవ్వాలి. అయితే ఈ పద్ధతి ఎక్కడా పాటించలేదు. గత ఖరీఫ్‌లో ప్రభుత్వం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 95,095 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించింది. వీటిని 45 రైసు మిల్లులకు తరలించారు. ఇచ్చిన ధాన్యంలో 67శాతం అంటే క్వింటాలుకు 67కిలోల బియ్యం మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన 63,714 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి రావాలి. 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఏడాది దాటినా బియ్యం ఇవ్వలేదు. అనేక సార్లు గడువు పొడిగించడంతో 43వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నులు మిల్లుల్లోనే ఉండిపోయాయి. అయితే ప్రభు త్వ నిబంధనల ప్రకారం లేవీ స్థానంలో డబ్బులు చెల్లించడం అనివార్యంగా మారింది. క్వింటాలుకు రూ.3,500 చొప్పున 20వేల మెట్రిక్ టన్నులకు రూ.70 కోట్లు ప్రభుత్వానికి మిల్లర్లు చెల్లించాల్సి ఉంది. ఫెనాల్టీ 25 శాతంతో కలిసి రూ.87.5 ఇవ్వాలి.

రబీ బియ్యం కూడా..

రబీ సీజన్‌లో 85,225 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం రైతుల నుంచి సేకరించింది. వీటిని కూడా మిల్లులకు తరలించింది. ఇందుకు సంబంధించి 57,953 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 4,192 మెట్రిక్ టన్నులు మాత్రమే అందజేశారు.

తీవ్ర జాప్యం

వడ్లను ఆడించి సీఎంఆర్ ఇవ్వడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వడ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే సకాలంలో ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రం లేవీ స్థానంలో రేషన్ బియ్యాన్ని ప్రభుత్వానికి అంటగడుతున్నారు. ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన వడ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తే రూ.2,000 నుంచి రూ. 2,200 వరకు ధర పలుకుతుంది. అయితే రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 900 నుంచి రూ. 1,200 చొప్పున చెల్లించి ప్రభుత్వానికి ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం జరుగుతోంది. మిల్లర్లు మాత్రం క్వింటాలుకు రూ. 1,500 నుంచి రూ. 2వేల వరకు లాభం పొందుతున్నారు.



ఓగిపూర్‌లో పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అభివృద్ధి బాధ్యత నాది

- సీఎం జిల్లా కావడంతో అధిక నిధులు తేస్తా
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాది అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఓగిపూర్‌లో గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీసుకుంటానని అన్నారు. ప్రతి గ్రామానికి పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. వికారాబాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు తీసుకోస్తానని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం సర్పంచు పద్మమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితాగౌడ్, నాయకులు ఉత్తమ్‌చందు, జనార్దన్‌రెడ్డి, రవిగౌడ్, శ్రీను, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, బసప్ప, పురుషోత్తం రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

తాండూరు పట్టణం, మండలంలోని 253మందికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డీటీ విజయేందర్, డీటీలు రాజిరెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చూస్తా

పెద్దేముల్: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య రాకుండా చూస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కందనెల్లిలో గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తానని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. కందనెల్లి గ్రామంలో రెండు రోజుల్లో బోరు వేసి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్ర శాలలు, తాగునీటి వసతి కల్పించాలని సర్పంచ్ మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. వెంటనే పనులు మంజురయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

తల్లిదండ్రులదే బాధ్యత

- పిల్లల డ్రైవింగ్‌పై దృష్టి సారించాలి
- ఎస్పీ కోటిరెడ్డి
- రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

వికారాబాద్ అర్బన్: మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత అని, ఏదైనా ప్రమాదం జరిగితే వారిపై కేసులు నమోదవుతాయని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం 35వ జాతీయ రహదారి భద్రత ఉత్సవాల సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా గంటకు సుమారు 400 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యత వహిస్తూ తమ పిల్లలకు, చుట్టు పక్కల వారికి ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా స్కూల్, కళాశాల ఉపాధ్యాయులు పిల్లలకు రోడ్డు ప్రమాదాలు, మైనర్లు డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ముప్పును వివరించాలన్నారు. మనం వాహనం జాగ్రత్తగా నడిపితే సరిపోదని, ఎదుటి వారు కూడా జాగ్రత్తగా నడిపినప్పుడే క్షేమంగా గమ్యం చేరుతామని తెలిపారు. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడమే ఇందుకు కారణమన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్ర ప్రమాదాలకు దారితీస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఎట్టి పరిస్థితిలో ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్టీఏ అధికారి జోసెఫ్, ఆర్టీసీ డిపో మేనేజర్ భక్షినాయక్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విరివిగా రుణాలివ్వాలి

బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రాధాన్యత రంగాలకు విరివిగా రుణాలు ఇచ్చి పూర్తి లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ నారాయణరెడ్డి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీసీ, డీఎల్ఆర్‌సీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ, మెప్మా తరఫున సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళా సంఘాల సభ్యులకు సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేసి రూ.100 కోట్ల విలువ చేసే చెక్కులను 4వ తేదీ నాటికి సిద్ధం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున వచ్చే ఐదు సంవత్సరాల్లో అన్ని రంగాలను అభివృద్ధి పరిచేందుకు బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతహా రంగాల అభివృద్ధికి రుణాలు అందించేందుకు పరిశ్రమల శాఖ అధికారి, ఎల్‌డీఎంలు ఫిబ్రవరిలో లోన్ మేళాలు నిర్వహించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రుణాలను ఫిబ్రవరి చివరి నాటికి అందజేయాలని, లేకుంటే బ్యాంకర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ రంగానికి రూ. 3829.86 కోట్ల లక్ష్యం కాగా, రూ. 2240. 25 కోట్లు అందించి 58.49 శాతం లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.1200.55 లక్ష్యం కాగా రూ. 392.97 కోట్ల రుణాలు అందజేసి 37.73 లక్ష్యం సాధించినట్లు తెలిపారు. ప్రాధాన్యత రంగాలకు రూ. 6361.52 కోట్లు లక్ష్యం కాగా, రూ. 2663.56 కోట్లు అందజేసి 41.87% లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు. ప్రాధాన్యతర రంగాలకు రూ. 1046.50 లక్ష్యం కేటాయించగా రూ. 399.08 కోట్ల రుణాలు అందజేసి 38.13 లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్ పంట రుణాలకు రూ. 1550.00 కోట్ల లక్ష్యం కాగా రూ.1224.96 కోట్ల మంజూరు చేసినట్లు తెలిపారు. పంట రుణాలు 90 శాతానికి తగ్గకుండా చూడాలని బ్యాంకర్లను ఆదేశించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి రూ. 6736.82 కోట్లతో రూపొందించిన ప్రొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం రాంబాబు, ఆర్‌బీఐ ఎల్‌డీఓ ఎస్ గోమతి, నాబార్డ్ డీడీఎం పీయూష్, డీఆర్‌డీఓ కృష్ణన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వినయ్ కుమార్, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- బిల్లులు రాకున్నా పనులు చేశారని కితాబు



మోమిన్‌పేట సర్పంచ్ లలితను సన్మానిస్తున్న సునీతారెడ్డి తదితరులు

మోమిన్‌పేట: గ్రామాల్లో అభివృద్ధిని చూస్తే సర్పంచులే గుర్తుకు వస్తారని, వారి పనితీరు చాలా బాగుందని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం మోమిన్‌పేటలో నిర్వహించిన సర్పంచుల సన్మాన సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచులు గ్రామాల్లో ఎప్పుడూ గుర్తిండి పోయే పనులు చేశారని అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పచ్చదనం, పారిశుద్ధ్యం సంతరించుకున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపించేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి, బిల్లులు సకాలంలో రాకున్నా అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. పల్లె ప్రగతి ద్వారానే రాష్ట్ర, జాతీయ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంలో మరింత చొరవ తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లా ను మొదటి స్థానంలో నిలపాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. బోధనలో ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. మహిళలు చట్ట సభల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఆర్థిక పురోగతి సాధించాలని, ఇందు కోసం చిన్నచిన్న వ్యాపారాలు చేయాలని సూచించారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం వందల కోట్లు వెచ్చించామని, ప్రస్తుతం రూ. 20కోట్ల నుంచి రూ. 30 కోట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందన్నారు. అనంతరం రాంనాథ్‌గుడుపల్లిలో నూతన పంచాయితీ భవనాన్ని, చిన్న కోల్కుందలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. మురుగు కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ వసంత వెంకట్, వైస్ ఎంపీపీ మానస, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, ఎంపీడీఓ శైలజారెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఏఈఈ పీఆర్ ప్రణీత్‌కుమార్ పాల్గొన్నారు.

చదువు ఆయుధం లాంటిది

- హాస్టల్ విద్యార్థులు వసతులను వినియోగించుకోవాలి
- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి వసతి గృహ విద్యార్థులకు బుధవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ప్రేరణ, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల్లో భయం, ఉత్సాహం ఉంటుందని, తమ లక్ష్యాన్ని సాధించే దిశగా దృష్టి సారించాలన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యం గొప్పగా ఉండాలని సూచించారు. చదువులో డిగ్రీలు ముఖ్యం కాదని నైపుణ్యంతో కూడిన విద్య ఎంతో ముఖ్యమని అన్నారు. దొడ్డిదారిలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో ఎంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు.వసతి గృహాల్లో పేద విద్యార్థులే ఉంటారని, విద్యతో భవిష్యత్తును మార్చుకోవాలని సూచించారు.పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో వసతులను కల్పిస్తోందని తెలిపారు. పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతోందని పేర్కొ న్నారు. పాఠ్యాంశాలపై తర్ఫీదు, మనోధైర్యాన్ని, వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంచేందుకు నిష్టాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లతో తరగతులు నిర్వహించడం గర్వించ దగ్గ విషయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఉమాపతి, వీరానందం, భీమ్ రాజు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు కే రామచంద్రుడు, కే మాధవి, మహేందర్, శ్రీధర్, పీవీ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు దిశానిర్దేశం

సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో బాధ్యతలు తీసుకోనున్న ప్రత్యేక అధికారులు ప్రజలు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన వారికి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తర్వులు అందిన వెంటనే జీపీల్లో బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మానవ వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై వికారాబాద్‌లోని స్త్రీ శక్తి భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ఎదుగుదలతో పాటు సామాజిక సమస్యలపై దృష్టి సారించాలన్నారు. మహిళలు, వితంతువుల సమస్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ కృష్ణన్, అదనపు డీఆర్‌డీఓ నర్సింలు, డీపీఎంలు రామ్‌నాథ్ నర్సింలు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత

సాంకేతికతతో ఛేదించిన పోలీసులు



సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: మండల పరిధిలోని దార్గులపల్లి, బూచన్‌పల్లి, పంచలింగాల గ్రామాలకు చెందిన ముగ్గురు వివిధ కారణాలతో తమ సెల్‌ఫోన్స్‌ను పోగొట్టుకున్నారు. పోయిన సెల్‌ఫోన్స్‌ను తమకు అప్పగించే విధంగా చూడాలని మర్పల్లి పోలీసులను ఆశ్రయించి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మర్పల్లి పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మూడు ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పీఎస్‌లో ఫిర్యాదుదారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

తాండూరు టౌన్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తాండూరు పట్టణ పోలీసులు సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానితో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖాంజాపూర్ గ్రామ శివారులోని కాగ్నా నది నుంచి అదే గ్రామానికి చెందిన వెంకటయ్య అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమాని మహేందర్‌తో పాటు డ్రైవర్ వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మూడవ ఓపెన్ టూ ఆల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్లను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 17వరకు మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓపెన్ బాలురు, బాలికలు, ఓపెన్ స్కూల్ బాలురు, ఓపెన్ స్కూల్ బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116 నగదు, రెండవ బహుమతిగా రూ.10,116 నగదు, మూడో బహుమతిగా రూ.5,116 నగదు బహుమతితో పాటుగా షీల్డు అందిస్తున్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, జంగయ్య, నర్సింహ, జగన్, మానయ్య, రవీందర్‌నాయక్, కృష్ణ నాయక్, ఖలీల్ తదితరులున్నారు.

ధాన్యం పైసలు మహాప్రభో!

- నెలలు గడుస్తున్నా జమ కాని వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ధాన్యం కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

పరిగి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు ఖాతాల్లో డబ్బులు పడక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో పీఏసీఎస్, మహిళా సమాఖ్య, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోళ్లు నిర్వహించారు. రైతుల నుంచి కొనుగోళ్లు చేసిన వారం రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉంది. కానీ నెలలు గడుస్తున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ధాన్యం అమ్మి సుమారు 45 రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.22 కోట్లు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా 19 మండలాలకు గాను 13 మండలాల్లో వరి పంటను రైతులు అధికంగా పండించారు. మొత్తం 121 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహిళా సమాఖ్య, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాలు కొనసాగాయి. నవంబర్ చివరి వారంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. మొదట ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు నెల రోజుల లోపు ఖాతాల్లో జమ అవ్వగా, తరువాత అమ్మిన వారికి జమ కావడంతో లేదు. 9,108 మంది రైతులు మొత్తం 44,633 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించారు. రూ.98.32 కోట్ల వ్యాపారం జరగగా రైతులకు రెండు నెలల నుంచి చెల్లించిన డబ్బులు కేవలం రూ.76.10 కోట్లు మాత్రమే. ఇంకా 60 శాతం రైతులకు రూ.22 కోట్లు చెల్లించాల్సి ఉంది.

పెట్టుబడి కోసం అప్పులు

ధాన్యం డబ్బులు వస్తేనే రైతులు ఈ సీజన్‌లో సాగుకు ఉపక్రమిస్తారు. ప్రభుత్వం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెబుతున్నా.. ప్రస్తుతానికి 48 రోజులు దాటినా డబ్బులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సాగు కోసం ధాన్యం విక్రయించిన డబ్బులు రాని రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నామని వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వానికి విక్రయిస్తే సమయానికి డబ్బులు రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

నెల రోజులవుతోంది



ధాన్యాన్ని 40 రోజుల క్రితం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాం. వారం రోజులకు బిల్లు అందించారు. ఇన్ని రోజులు అవుతున్న ఇంత వరకు డబ్బులు జమ కాలేదు. పంట సాగు చేసేందుకు డబ్బులు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం.

–వెంకటయ్య రైతు, పాలేపల్లి

సాకులు చెబుతున్నారు



వానకాలం సీజన్‌లో నాలుగు ఎకరాలల్లో వరి వేశాను. అందులో పండిన 250 బస్తాల ధాన్యాన్ని విక్రయించి 42 రోజులు అవుతున్నా నేటికీ డబ్బులు రాలేని పరిస్థితి. సంబంధిత అధికారులను అడిగితే సాకులు చెబుతున్నారు.

– బోయిని జంగయ్య, రైతు, బొంపల్లి

త్వరలోనే జమ చేస్తాం



ధాన్యం విక్రయించిన రైతులకు త్వరలోనే డబ్బులు జమ చేస్తాం. ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి ప్రాసెస్‌లో ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. వీలైనంత తొందరగా ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

కలప తరలిస్తున్న వాహనాల సీజ్

పూడూరు: అనుమతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీలాపూర్ గేటు వద్ద మంగళవారం రాత్రి పోలీసులతో గస్తీ నిర్వహిస్తుండగా ఓ లారీలో కటింగ్ చేసిన కలపను గుర్తించారు. పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్ బోయ రవిపై కేసు నమోదు చేశారు. మన్నేగూడ చౌరస్తాలో గస్తీ నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా కటింగ్ కలపను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. కలపకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.



లారీని సీజ్ చేసిన పోలీసులు

కాంగ్రెస్ ఫ్లెక్సీలో ‘పట్నం’ ఫొటో

తాండూరు: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉన్న ఫొటో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలో దర్శనమివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు తాండూరు నియోజకవర్గంలోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ మారుతున్నట్టు వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేయడం గమనార్హం.



కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలో బీఆర్‌ఎస్ నేత మహేందర్‌రెడ్డి

గంధోత్సవాలు జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: పెద్దాపూర్ జాకీర్‌నగర్‌లో వెలిసిన హజ్రత్ మౌలానా సోఫీ సాజిద్ పాషా ఖాద్రి సత్తారి రహమతుల్లాలై గంధోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్, ఆసిఫ్‌ఖాన్, నయీమ్‌ఆసిఫ్ కరీం అశ్రఫీ కోరారు. బుధవారం పట్టణంలోని మక్కా మసీద్‌లో గంధోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 3, 4, 5, 6వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వసీం, షాకీర్, రహమత్‌ఖాన్, అమెర్‌ఖాన్, యూసుఫ్, అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- తాండూరు కౌన్సిల్ సమావేశంలో వెల్లడి



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా జరిగిన గొడవలు అనవసరం. వాటి జోలికి వెళ్లకుండా మిగిలిన ఏడాది కాలంలో కౌన్సిల్ సభ్యులు వార్డుల అభివృద్ధికి పాటు పడాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ తాటికొండ స్వప్న అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ఏర్పడిన నాటి నుంచి నిర్వహించిన సమావేశాలు గొడవలతో అర్ధాంతరంగా ముగిశాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో జరిగిన కౌన్సిల్ సమావేశం తొలిసారి ప్రశాంతంగా జరిగింది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో రూ.14.40 కోట్ల నిధులకు గాను 24 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టారు. అందులో 21 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ భవనం ఆధునికీకరణకు కేటాయించిన నిధులపై కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం చెప్పారు. మున్సిపల్ పరిధిలో తైబజార్ వేలం విషయంలో సభ్యుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. మున్సిపల్ ఆధీనంలోకి వచ్చిన స్థలాల్లో అధికారులు ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని పలువురు కౌన్సిలర్‌లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కబ్జాకు గురవుతున్న గొల్ల చెరువును పరిరక్షించాలని కౌన్సిలర్‌లు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమావేశంలో రాజకీయాలకు తావులేదని పార్టీలు, సొంత ఎజెండాలు పక్కన పెట్టి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కౌన్సిల్‌లో స్వపక్షం, ప్రతిపక్షం రెండు ఉండాలన్నారు. అప్పుడే ప్రజల పక్షాన పని చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల వరకే పార్టీలు, పట్టింపులు ఉండాలి. అభివృద్ధి చేస్తామనే ప్రజలు మనల్ని గెలిపించారన్నారు. మున్సిపల్ అభివృద్ధి విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న పార్కుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గొల్లచెరువు ఆధునికీకరణ పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. అధికారులు మున్సిపల్ స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించాలన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, కౌన్సిలర్‌లు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ శోభరాణి, కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ మధుబాల, కౌన్సిలర్‌లు రత్నమాల, నీరజాబాల్‌రెడ్డి, బోయరవిరాజ్, రామకృష్ణ, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు తదితరులున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

మర్పల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఘణాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి రమేష్(36) కర్ణాటక రాష్ట్రం శివరాంపూర్ గ్రామానికి చెందిన జ్యోతిని ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. రమేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకొనేవారు. ఇటీవల ఆయన భార్యని ప్రసవం కోసం పుట్టింటికి పంపారు. మంగళవారం రాత్రి ఆయన తల్లితో కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు నిద్ర నుంచి లేవకపోవడంతో స్థానికులు చూడగా రమేష్ దూలానికి ఉరేసుకొని విగత జీవిగా కనిపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని తల్లి సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత మృతి

పూడూరు: అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్నేగూడకు చెందిన ఎర్ర అండాలు, బాలయ్య దంపతుల రెండో కూతురును గొంగుపల్లికి చెందిన ఎర్రోళ్ల వెంకటేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. భార్యాభర్తలు మంగళవారం భోజనం చేసేటప్పుడు మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో భార్య గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. వెంటనే ఆమెను వికారాబాద్ మిషన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

సమగ్ర విచారణ చేయండి

ఆ ఓట్లపై మైనార్టీల ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మైనార్టీలు

ధారూరు: సొంతూరుని విడిచి బతుకుదెరువుకు పట్నానికి వెళ్లాం.. నిబంధనలకు లోబడే ఓట్లేసామని మండలంలోని ఎబ్బనూర్‌కు చెందిన మైనార్టీలు అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు విన్నవించారు. మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి వాస్తవాన్ని తేల్చాలని వారు బుధవారం కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఎబ్బనూర్‌లో దొంగ ఓట్లు ఉన్నాయంటూ మాజీ సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో గ్రామ కార్యదర్శి 72 మందిని గుర్తించి, వాటిని తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కొంత మంది మైనార్టీలు అదనపు కలెక్టర్‌ను కలిశారు. మాపై మాజీ సర్పంచ్ కక్షబూని ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు చేయడంతో పరిశీలించి దొంగ ఓట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసిన మైనార్టీల వెంట గ్రామ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

పశు సంవర్ధకశాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ పున్నయ్య



నాగారంలో పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

ధారూరు: ప్రభుత్వం అందించే పశువుల పునరుత్పత్తి సాధనాలను ఉపయోగించుకొని పాల దిగుబడిని పెంచుకోవాలని పశు సంవర్ధకశాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ బసవ పున్నయ్య సూచించారు. మండలంలోని కేరెళ్లి సత్యసాయి సేవా సమితి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పశువులకు ఉచితంగా చికిత్సలు అందించడంతో గ్రామీణ రైతులకు మేలు జరుగుతందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గాలికుంటూ టీకాలు ప్రతి 6 నెలలకు ఒకసారి తీసుకుంటే పశువులకు సోకే పేలు, గోమార్లు వ్యాపించకుండా ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు.

నాగ్‌సాన్‌పల్లిలో..

నాగ్‌సాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 310 పశువులకు సాధారణ చికిత్సలు, గర్భకోశ చికిత్సలు 42, పేలమందు 150, గాలికుంటూ టీకాలు 85 పశువులకు చికిత్స చేశారు. లవణ మిశ్రమం 25 కిలోలు, బలవర్ధక ఆహార పంపిణీ 13 లీటర్లు, 35 రైతులకు అందజేశారు.

నాగారంలో..

12 పశువులకు గర్భకోశ చికిత్సలు చేయగా పేల మందు 130 పశువులకు, గాలికుంటూ టీకాలు 75 పశువులకు, 620 పశువులకు సాధారణ చికత్స చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 15 మంది రైతులకు బలవర్ధక ఆహారం పదార్థం 8 లీటర్లు, లవణ మిశ్రమం 4 కిలోలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువుల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి అనిల్‌కుమార్, డాక్టర్లు శ్రావణ్‌కుమార్, సాధన, పద్మాకర్‌రావు, హాతిరాం, శ్రీకర్‌రెడ్డిలు, స్వర్ణలత, సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సభ్యులు నరేశ్, నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

9 నుంచి పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నీ

- కొండా వెంకటరంగారెడ్డి, కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు
- విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతి

చేవెళ్ల: ఈ నెల 9 నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నారని నిర్వాహకులు అత్తెల్లి అనంత్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొండా వెంకటరంగారెడ్డి, మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని క్రికెట్ జట్లు పాల్గొనవచ్చునని చెప్పారు. టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఈ టోర్నమెంట్ నిర్వహకులుగా అనంత్‌రెడ్డితోపాటు కిట్టు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీన్‌చారి, నవీన్, గణేశ్, మహేశ్వర్‌రెడ్డి ఉంటారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదుకు 9849153278, 7893122562, 9849007513 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పేదల బియ్యం పక్కదారి!

పేద ప్రజలకు ఆకలి బాధను తీర్చే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకువచ్చిన రేషన్ బియ్యం పంపిణీ పక్క దారి పడుతోంది. అంతారం కేంద్రంగా అక్రమార్కులు దందా సాగించి కాసులు దండుకుంటున్నారు. జిల్లాలో జోరుగా సాగుతున్న అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంపై అధికారుల చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి.

- సరిహద్దు కేంద్రంగా యథేచ్ఛగా రేషన్ దందా
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



అంతారంలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

దౌల్తాబాద్: పేదల బియ్యం పక్కదారి పడుతోంది. కొన్నేళ్లుగా రేషన్ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పేదలకు ఇచ్చే బియ్యాన్ని కొందరు దళారులు వ్యాపారంగా మార్చుకున్నారు. జిల్లాలోని రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు దౌల్తాబాద్ మండలాన్ని కేంద్రంగా ఎంచుకున్నారు. దళారులు ద్విచక్ర వాహనాల మీద ఊళ్లలో తిరుగుతూ బియ్యాన్ని సేకరించి దౌల్తాబాద్ నుంచి అంతారం మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ మొత్తంలో సంపాదిస్తున్నారు. అడ్డు వచ్చిన అధికారులకు మామూళ్లు ముట్ట చెబుతూ మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రెండేళ్లుగా జిల్లాలో నమోదైన కేసులు చూస్తే ఈ దందా ఎలా ఉందో అవగతం అవుతోంది. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికైనా పేదల బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతారం కేంద్రంగా

మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి గత కొన్నేళ్లుగా రేషన్‌దందా కొనసాగిస్తున్నారు. ఆయనకు మండలంతో పాటు చుట్టు పక్కల ఉన్న కోస్గి, కొడంగల్, మద్దూరు మండలాల్లో కొంత మంది దళారులను నియమించుకుని దందా చేస్తున్నారు. వారు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రూ.10 కిలో చొప్పున బియ్యం సేకరించి రూ.13 విక్రయిస్తారు. సదరు వ్యాపారి డీసీఎంలలో కర్ణాటకకు తరలించి రూ.25 చొప్పున అమ్ముకుంటారు. వ్యాపారికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో వ్యాపారం జోరుగా సాగుతుంది. గతంలో పలుమార్లు పోలీసులకు పట్టుబడినా దందాను మాత్రం వీడలేదు. ఈ గ్రామం కర్ణాటకకు కూతవేటు దూరంలో ఉండడంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది.

డీలర్లు సైతం

గతంలో దళారులు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.10 వెచ్చించి రేషన్ బియ్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం డీలర్లు సైతం బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు బియ్యాన్ని ఇంటి వరకు తెచ్చుకోకుండా అట్నుంచి అటే రేషన్ డీలర్లకు అమ్మేస్తున్నారు. డీలర్లు అనధికారి నగదు బదిలీ దందాకు తెరలేపారు. ఇందుకు నిదర్శనం ఇటీవల అంతారం గ్రామానికి చెందిన వ్యాపారి దగ్గర దొరికిన 108 క్వింటాళ్ల బియ్యం బస్తాలే సాక్ష్యం. అయితే గ్రామం నుంచి ఎటువంటి చెక్ పోస్టు లేకపోవడంతో అక్రమ రవాణా జోరుగా సాగుతుంది.

కఠిన చర్యలు

ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రవాణా చేసే వ్యక్తుల పేర్లు చెబితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ప్రస్తుతం అక్రమ దందా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం.

– ప్రశాంత్ వర్ధన్, టాస్క్‌ఫోర్స్, సీఐ